క్లుప్తంగా

నేడు రక్తదాన శిబిరం

మదనపల్లె సిటీ: జాతీయ రక్తదాన దినోత్సవం పురస్కరించుకుని మంగళవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు హెల్పింగ్‌మైండ్స్ సంస్థ వ్యవస్థాపకులు అబూబకర్‌సిద్దిక్ తెలిపారు. స్థానిక ఇందిరానగర్‌లోని మెట్రో కాంప్లెక్స్ వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 వరకు శిబిరం జరుగుతుందన్నారు. రక్తదానం చేసేవారు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి రక్తదానం చేయాలని కోరారు.

ఏపీ హాకీ రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా జలజ



మదనపల్లె సిటీ: ఆంధ్రప్రదేశ్ హాకీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షురాలిగా స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలకు చెందిన పీడీ జలజ ఎన్నికయ్యారు. గుంటూరులో జరిగిన రాష్ట్ర స్థాయి ఎన్నికల్లో ఈమెను ఎన్నుకున్నట్లు రాష్ట్ర హాకీ సంఘం డైరెక్టర్ నిరంజన్‌రెడ్డి తెలిపారు.ఆమె ఎంపిక పట్ల జిల్లా హాకీ అసోసియేషన్ అధ్యక్షులు పి.వి.ప్రసాద్, కార్యదర్శి శివప్రసాద్,కోశాధికారి ప్రసాద్‌రెడ్డిలు హర్షం వ్యక్తం చేశారు.

పింఛన్‌దారులకు సమాచారం ఇవ్వండి

పెద్దతిప్పసముద్రం: దూర ప్రాంతాల్లో ఉన్న నెలవారి పింఛన్‌దారులకు ఫోన్ ద్వారా ముందస్తుగా సమాచారం ఇవ్వాలని ఎంపీడీఓ కేఎస్ బాలాజీ కార్యదర్శులను ఆదేశించారు. ఈ సందర్భంగా సోమవారం ఆయన మాట్లాడుతూ మండలానికి సంబంధించి 7,949 పింఛన్ దారులకు రూ.3.41 కోట్ల నిధులు విడుదలయ్యాయి. ఒకటో తేదీ ఉదయం నుంచే లబ్ధిదారులకు పింఛన్ అందజేయాలని సూచించారు.

న్యాయం చేయాలని వినతి

బి.కొత్తకోట: మండలంలోని మొటుకు పంచాయతీ ముడివారిపల్లెకు చెందిన రైతులకు సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో డీటీకి వినతిపత్రం అందించి మాకు న్యాయం చేయాలని విన్నవించారు. ముడివారిపల్లెకు చెందిన 40 మంది రైతులు మాజీ ఎమ్మెల్యే నరసింగరావు కుటుంబానికి చెందిన 22 ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నారు. ఈ భూమిపై ఆధారపడిన తమకే ఈ భూములు విక్రయించేలా చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వేడుకున్నారు.

నేడు పెన్షన్లు పంపిణీ

తంబళ్లపల్లె: మండలంలోని సచివాలయ ఉద్యోగుల ద్వారా మంగళవారం పెన్షన్లు పంపిణీ చేయనున్నట్లు ఎంపీడీఎఓ సురేంద్రనాథ్ తెలిపారు. మండలంలో అన్ని రకాల 6,218 మంది లబ్ధిదారులకు రూ.2.68 కోట్లు పంపిణీ చేస్తామన్నారు. పెన్షన్‌దారులు ఇంటి వద్దనే ఉండి పెన్షన్ తీసుకోవాలని కోరారు.

సబ్సిడీ ఉలవలను సద్వినియోగం చేసుకోవాలి

తంబళ్లపల్లె: మండలంలోని రైతులు సబ్సిడీ ఉలవలను సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారి రమణకుమార్ తెలిపారు.మండలానికి 500 క్వింటాళ్ల ఉలవలు రైతులకు సబ్సిడీ ధరకు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఉలవలను సకాలంలో బీడు భూముల్లో సాగు చేసి మంచి దిగుబడి సాధించి లబ్ధి పొందాలన్నారు.

కారు ఢీకొని వ్యక్తికి గాయాలు

పెద్దతిప్పసముద్రం : మండలంలోని మల్లెల పంచాయతీ ఉప్పరవాండ్లపల్లికి చెందిన నాగరాజు (40) భవన నిర్మాణ కార్మికుడిగా పని చేసేవాడు. ఈ నేపథ్యంలో సోమవారం కార్మికుడు ద్విచక్ర వాహనంలో కూలి పనికి వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రుడిని బి.కొత్తకోటలోని సీహెచ్‌సీలో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో మదనపల్లి జిల్లా ఆసుపత్రికి తరలించారు.

ఆయాలు బాధ్యతగా పని చేయాలి

పీలేరు : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఆయాలు బాధ్యతాయుతంగా పని చేయాలని సీడీపీఓ రాజమ్మ అన్నారు. సోమవారం స్థానిక సీఎల్ఆర్‌సీ కార్యాలయంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలను ప్రతి రోజూ శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వంట చేసే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం స్వచ్ఛ తా హీ సేవా కార్యక్రమం ప్రతిజ్ఞ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు స్వరూప, స్వర్ణ, అక్కాయమ్మ, ఉమా, శాంత, అమరావతి, భారతి పాల్గొన్నారు.

రైతుపై దాడికి నిరసనగా దుకాణాలు బంద్

రామసముద్రం: టమాటాల చోరీ విషయమై రైతుపై దళితులు దాడి చేసి తీవ్రంగా కొట్టిన సంఘటనను నిరసిస్తూ మండల కేంద్రంలో దుకాణాదారులు సోమవారం స్వచ్ఛందంగా బంద్ నిర్వహించారు. వివరాలిలా ఉన్నాయి. దిగువహరిజనవాడకు చెందిన గోవిందు , బి.కుర్రప్పలకు చెందిన ఓ రైతు పొలంలో శనివారం రాత్రి టమాటాలు చోరీ చేస్తుండగా విషయాన్ని బలిజవీధికి చెందిన ఆదినారాయణ రెడ్డి చూసి పొలం యజమానికి చెప్పాడు. ఆగ్రహించిన గోవిందు తనతో పాటు మరి కొంత మందితో వెళ్లి ఆదినారాయణరెడ్డిపై దాడి చేసి తీవ్రంగా కొట్టాడు. బాధితుడు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పరిసరాల శుభ్రతతోనే ఆరోగ్యం



పీలేరు: కోర్టు ఆవరణలో పారిశుద్ధ్య కార్యక్రమాలు



స్వచ్ఛతాహీ సేవ కార్యక్రమంలో గ్రామీణ బ్యాంకు ఉద్యోగులు

జిల్లా 11వ అదనపు జడ్జి మహేష్

పీలేరు రూరల్ : పరిసరాలను ప్రతి ఒక్కరూ శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా 11వ అదనపు జడ్జి ఎ. మహేష్ అన్నారు. సోమవారం సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశాల మేరకు కోర్టు ఆవరణలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. కోర్టు ఆవరణలో ఉన్న మొక్కలను, పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ మన పరిసరాలను మనమే శుభ్రం చేసుకోవాలని, మనమే అందరికీ స్ఫూర్తిదాయకంగా ఉండాలన్నారు. పరిసర ప్రాంతాలు శుభ్రంగా ఉంటే ఎలాంటి అనారోగ్యాలు దరి చేరవన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి కె. రవి, బార్ అసోసియేషన్ అధ్యక్షులు బి.సి. పురుషోత్తం రెడ్డి, న్యాయవాదులు,శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవికుమార్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పరిసరాల శుభ్రంగా ఉంచుకోవాలి

మదనపల్లె సిటీ: పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా ఆరోగ్యంగా ఉండవచ్చని గ్రామీణ బ్యాంకు రీజనల్ మేనేజర్ ప్రకాష్‌రత్నబాబు అన్నారు. సోమవారం స్వచ్ఛతా–హీ కార్యక్రమంలో భాగంగా సప్తగిరి గ్రామీణ బ్యాంకు, నేషనల్ బ్యాక్‌వర్డ్ ఫైనాన్షియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక జీఆర్టీ ఉన్నత పాఠశాల మైదానంను విద్యార్థులతో కలిసి శుభ్రపరిచారు. చెత్తా చెదారం ఎత్తివేశారు. పిచ్చిమొక్కలను తొలగించారు. కార్యక్రమంలోఓ ప్రోగామ్ కోఆర్డినేటర్ చుక్కల నవీన్,పాఠశాల హెచ్ఎం తదితరులు పాల్గొన్నారు.

పీలేరు చేరిన అంబేడ్కర్ దమ్మయాత్ర



పీలేరులో అంబేడ్కర్ దమ్మయాత్ర

పీలేరు రూరల్ : కేరళ నుంచి నాగపూర్ చేపట్టిన అశోక – అంబేడ్కర్ దమ్మయాత్ర సోమవారం పీలేరుకు చేరుకుంది. ఈ యాత్రకు స్థానిక బహుజన సంక్షేమ సంఘం, శాంతిచక్ర సంస్థ నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం స్థానిక మార్కెట్‌యార్డు వద్ద జ్యోతీరావుపూలే, యాత్రలో వచ్చిన అశోక్‌చక్రవర్తి విగ్రహానికి పూల మాలలతో నివాలులర్పించారు. అక్కడి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. బౌద్ధబిక్షులు మాట్లాడుతూ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బౌద్ధమతంలో చేరిన రోజును పురస్కరించుకుని నాగపూర్‌లో అశోక్ చక్రవర్తి విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బౌద్ధబిక్షువులు (బంతీలు) అశోక్‌కుమార్, అంకిత్, స్థానిక బహుజన సంక్షేమసంఘం, శాంతిచక్ర సంస్థ నాయకులు ఎ. బలరాం, రామచంద్ర, పోతయ్య, చంద్రయ్య, నఫీజ్, సురేంద్ర, షణ్ముగం, రామయ్య, రసూల్ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సంతాపం

బి.కొత్తకోట: మండలంలోని గట్టు గ్రామం కాయలవారిపల్లెకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు దాదం శంకర్‌రెడ్డి (65)సోమవారం మృతి చెందాడు. ఆయన మృతదేహానికి ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథ రెడ్డి నివాళులర్పించి సంతాపం వ్యక్తం చేశారు. శంకర్‌రెడ్డి పార్టీలో క్రియాశీలంగా పనిచేశారని ఎమ్మెల్యే అన్నారు. వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షులు పాగొండ ఖలీల్, జెడ్పీటీసీ రామచంద్ర, సర్పంచులు జయరామిరెడ్డి, సాంబశివ, ఎంపీటీసీ రామసుబ్బారెడ్డి, మండలానికి చెందిన పార్టీ నాయకులు, కార్యకర్తలకు నివాళులర్పించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు

పెద్దమండ్యం: రోడ్డుప్రమాదంలో యువకుడు గాయపడ్డాడు. ఈ సంఘటనపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ పివి రమణ తెలిపారు. కలిచెర్ల – గుర్రంకొండ రహదారిపై గ్రామ సచివాలయం వద్ద మలుపులో 23న జరిగిన రోడ్డు ప్రమాదంలో కలిచెర్ల పాతూరుకు చెందిన ఎస్ షబ్బీర్‌అహ్మద్ కుమారుడు మన్సూర్ (20) తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. బెంగళూరులోని ఓ ప్రవేటు ఆసుపత్రిలో బాధితుడు చికిత్స పొందుతున్నాడు. బాధితుని తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నీటి వృథాను అరికట్టండి



నీటిట్యాంక్‌ను పరిశీలిస్తున్న ఈఓపీఆర్‌డీ తదితరులు

కలకడ : నీటిని వృథా చేయకుండా అరికట్టాలి. ఉన్న నీటిని రోజువారి అవసరాలకు సద్వినియోగం చేసుకోవాలని ఈఓఆర్‌డీ లతీఫ్‌ఖాన్, సర్పంచ్ ఫ్యారీజాన్, ఎంపీటీసీ సభ్యులు ముబారక్ సూచించారు. సోమవారం కలకడ పంచాయతీలో పర్యటించి వీధి దీపాలను, నీటి ట్యాంకులను తనిఖీ చేశారు. వీధి దీపాలను మరమ్మతు చేయించి వెలిగించేలా సిబ్బందిని ఆదేశించారు. స్కీంబోర్ నుంచి నేరుగా నీటి కుళాయిలు కావాలని, ఎత్తులో ఉన్న ఇంటికి నీరు రావడం లేదని స్థానికులు తెలిపారు. డైరెక్ట్ పంపింగ్ విధానం మంచిదికాదని అలా అయితే కేవలం రెండు కుటుంబాలకే స్కీం బోరులో నీరు మొత్తం సరిపోతుందని, ఇతర కుటుంబాల పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. పంచాయతీ ద్వారా ఏర్పాటు చేసిన ట్యాంకులకు మాత్రమే స్కీం బోర్ నీటిని నింపి అనంతరం కుళాయిల ద్వారా మాత్రమే కుటుంబాలకు వినియోగించేకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి, సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటి నిర్మాణాలు కూల్చడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు



జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న టి.ఎల్. వెంకటేష్

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్ట పంచాయతీ మల్లారపువాండ్లపల్లె వద్ద దళితుల ఇంటి నిర్మాణాలు కూల్చడంపై సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి టి.ఎల్. వెంకటేష్ సోమవారం జిల్లా కలెక్టర్ శ్రీధర్ చామకూరికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మల్లారపువాండ్లపల్లె వద్ద కొంతమంది దళితులు, అగ్రవర్ణాలు వారు ఇళ్ల నిర్మాణాలు చేపట్టి గుణాలు, గోడలు నిర్మించారని తెలిపారు. అయితే రెవెన్యూ అధికారులు ఆ స్థలంలో ఇళ్లు నిర్మించడం చట్ట విరుద్ధమని జేసీబీలతో దళితుల నిర్మాణాలు మాత్రం కూల్చివేశారని తెలిపారు. ఇళ్ల నిర్మాణాలకు విద్యుత్ సౌకర్యం, బోరు సౌకర్యం కల్పించి నిర్మాణాలు కూల్చడం బాధాకరమని చెప్పారు. దళితులు మోసపోవడానికి కారణమైన అప్పటి అధికారులు, ప్రభావితం చేసిన నాయకులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు వెంకటేష్, రైతు సంఘం నాయకులు రంగారెడ్డి, పుల్లయ్య పాల్గొన్నారు.

పారిశుద్ధ్యంతోనే ప్రజారోగ్యం



చెత్త సంపద కేంద్రాన్ని ప్రారంభించిన అధికారులు

కేవీపల్లె : పారిశుద్ధ్యంతోనే ప్రజారోగ్యం లభిస్తుందని ఈవోపీఆర్‌డీ గఫూర్ అన్నారు. సోమవారం మండలంలోని తిమ్మాపురం పంచాయతీలో డబ్ల్యూపీసీ షెడ్‌ను పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛహీ సేవా కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్యక్రమాలు విస్తృతంగా చేపట్టినట్లు తెలిపారు. చెత్తాచెదారం, వ్యర్థ పదార్థాలు ఎక్కడపడితే అక్కడ వేయరాదని, పంచాయతీ చెత్తసేకరణ వాహనంలో వేయాలని కోరారు. పంచాయతీ కార్యదర్శి బి. వసంత, గ్రీన్ అంబాసిడర్లు పాల్గొన్నారు.

అభివృద్ధిపై ప్రభుత్వాల నిర్లక్ష్యం



బి.కొత్తకోట: ధర్నా చేస్తున్న సీపీఐ కార్యకర్తలు

బి.కొత్తకోట: అభివృద్ధిపై కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తున్నాయని నిరసిస్తూ సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ కార్యకర్తలు ధర్నా నిర్వహించారు. ప్రభుత్వాలకు వ్యతిరేకంగా నినాదాలు చేసారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కడప నుంచి బి.కొత్తకోట మీదుగా హైవే రోడ్డు నిర్మించాలని, హంద్రీ–నీవా ద్వారా చెరువులకు కృష్ణా జలాలను తరలించాలని, టమాట ఆధారిత పరిశ్రమలను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బి.కొత్తకోటలో అక్రమ లేఅవుట్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. అనంతరం డీటీ అన్సారీకి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నియోజకవర్గ కార్యదర్శి మనోహర్‌రెడ్డి, బషీర్‌ఖాన్, సమీవుల్లా, రఘునాథ్‌రెడ్డి, అష్రఫల్లీ, గంగులప్ప తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులను వినియోగించుకోవాలి

తంబళ్లపల్లె: గ్రామ పంచాయతీల్లో నిర్మించిన డంపింగ్‌యార్డులను వినియోగించుకోవాలని ఈఓపీఆర్డీ దిలీప్‌కుమార్ తెలిపారు. సోమవారం ఎర్రసానిపల్లె పంచాయతీలో ఏర్పాటు చేసిన డంపింగ్ యార్డును స్వచ్ఛతాహీ సేవా కార్యక్రమంలో భాగంగా పునః ప్రారంభించారు. సర్పంచు సుగుణమ్మ, కార్యదర్శి రఘునాథ్, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు గ్యారంపల్లె ఏపీఆర్‌జేసీ విద్యార్థులు





కేవీపల్లె: రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపాల్ చెన్నకేశవులు, కలకడ: విద్యార్థులను అభినందిస్తున్న హెచ్ఎం చెంగల్‌రాయుడు

కేవీపల్లె : ఏపీ స్కూల్ గేమ్స్ ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థాయిలో అండర్ –19 విభాగంలో మండలంలోని గ్యారంపల్లె ఏపీఆర్‌జేసీ విద్యార్థులు 20 మంది విశేష ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ చెన్నకేశవులు తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికై న విద్యార్థులను సోమవారం కళాశాలలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుపతిలో జరిగిన 800, 1600 మీటర్ల పరుగుపందెంలో నూర్ మొహ్మద్ ప్రతిభ చూపి రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు తెలిపారు. చంద్రగిరిలో జరిగిన ఫుట్‌బాల్ పోటీలో ఉద్భవ ముని ప్రతిభతో రాష్ట్ర జట్టుకు ఎంపికైనట్లు చెప్పారు. మదనపల్లెలో జరిగిన నెట్‌బాల్ పోటీలో సందీప్, ఫయాజ్, గురుమధు, చరణ్, బాస్కెట్ బాల్ పోటీలో హనుమంతు ప్రతిభ చూపి రాష్ట్రజట్టుకు ఎంపికై నట్లు తెలిపారు. తమ కళాశాలలో జరిగిన హ్యాండ్‌బాల్ పోటీలో హర్ష, మహేష్‌నాయక్, చంద్ర, మనోజ్, నాగదినేష్, గిరివర్ధన్, త్రోబాల్ నందు భువన్, కృష్ణకీర్తన్, నరేంద్ర, టెన్నీ కాయిట్ నందు గురువర్ధన్, రబ్బీలో హేమంత్, శ్రీనివాసులు, రాకేష్ విశేష ప్రతిభతో రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపికైనట్లు వివరించారు. 20 మంది విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపిక కావడానికి కృషి చేసిన ఫిజికల్ డైరెక్టర్ నరేంద్రకుమార్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో స్టూడెంట్ అడ్వైజర్ డాక్టర్ రమాదేవి, లెక్చరర్ సౌజన్య పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు కోన ఉన్నతపాఠశాల విద్యార్థులు

కలకడ : రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు మండలంలోని కోన జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికై నట్లు ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చంగల్‌రాయుడు తెలిపారు. సెప్టెంబర్ 28న మదనపల్లె బీటీ కళాశాలలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో అండర్–17 హ్యాండ్‌బాల్ విభాగంలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన కోన ఉన్నతపాఠశాలకు చెందిన ఐదుగురు బాలురు, ఇద్దరు బాలికలను రాష్ట్రస్థాయి జట్టుకు ఎంపిక చేసినట్లు తెలిపారు. అక్టోబర్ 7, 8 తేదీలలో రాజమండ్రిలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో అండర్–17 విభాగంలో బాలికల జట్టులో ఫరహానా, సమీరా, బాలుర జట్టులో యోగేశ్వర్, రెడ్డిప్రసాద్, సమీర్‌ఖాన్, జితేంద్ర, షారుఖ్‌ఖాన్ పాల్గొననున్నట్లు వివరించారు.

ప్రజాసమస్యలు పరిష్కరించండి సారూ..!

– పీజీఆర్ఎస్‌కు 85 ఫిర్యాదులు



ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సబ్ కలెక్టర్ మేఘస్వరూప్

మదనపల్లె : మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలో ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రతి సోమవారం సబ్ కలెక్టరేట్‌లో నిర్వహించే ప్రజాఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్)కు 85 ఫిర్యాదులు అందాయి. సోమవారం ఉదయం సబ్ కలెక్టర్ మేఘస్వరూప్, సమస్యలపై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. భూసమస్యలు, పాసుపుస్తకాలు, సర్వే, భూపరిహారం, ఆస్తి తగాదాలు, మౌలికవసతులు, రేషన్‌కార్డులు, పెన్షన్ మంజూరుపై పలువురు సబ్ కలెక్టర్‌కు అర్జీలు అందజేశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్, ప్రజలు సమర్పించిన అర్జీలను సంబంధిత అధికారులకు పంపి, ప్రభుత్వ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని, లేనిపక్షంలో అందుకు గల కారణాలు తెలుపుతూ నివేదిక అందించాలని ఆదేశాలు జారీచేశారు.

దసరాకు స్పెషల్ బస్సులు



మెకానిక్‌ను అభినందిస్తున్న ఆర్టీసీ ఈడీ చెంగల్‌రెడ్డి

మదనపల్లె సిటీ: దసరా పండుగను పురస్కరించుకుని ప్రత్యేక బస్సు సర్వీసులు నడపనున్నట్లు ఆర్టీసీ ఇన్‌చార్జ్ ఈడీ (కడప) తిమ్మారెడ్డి చెంగల్‌రెడ్డి అన్నారు. సోమవారం స్థానిక వన్ ,టు డిపోలను తనిఖీ చేశారు. మదనపల్లె నుంచి హైదరాబాదు, విజయవాడ, బెంగళూరుకు నడపనున్నట్లు పేర్కొన్నారు. ఆదాయం పెంచుకునేందుకు అందరూ కలిసి పని చేయాలని సూచించారు. కార్గోపై ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. కార్గో గురించి విస్తృత ప్రచారం చేసి ఆదాయం పెంచాలన్నారు. త్వరలో కొత్త బస్సులు రానున్నట్లు తెలిపారు. డిపోలోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రెండు డిపోల్లో గ్యారేజ్, బస్‌స్టేషన్‌లను పరిశీలించారు. ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బంది, మెకానిక్,డ్రైవర్లు, కండక్టర్లు, సూపర్‌వైజర్లు, ఆఫీసు సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో డీఎం మూరే వెంకటరమణారెడ్డి, సీఐలు రేవతి, గీత, యూనియన్ నాయకులు బాబు పాల్గొన్నారు.

మెడిసిన్ సీటు సాధించిన విద్యార్థినికి సన్మానం



మెడిసిన్ ఉచిత సీటు సాధించిన సాదియాను సన్మానిస్తున్న అధ్యాపకులు, సిబ్బంది

గుర్రంకొండ : స్థానిక ప్రభుత్వ తెలుగు జూనియర్ కళాశాలకు చెందిన ఎస్. సాదియా మెడికల్ ఉచిత సీటును సాధించడం పట్ల కళాశాల సిబ్బంది, అధ్యాపకులు ఘనంగా సన్మానం చేశారు. గుర్రంకొండకు చెందిన సాదియా స్థానిక ప్రభుత్వ తెలుగు జూనియర్‌కళాశాలలో ఇంటర్ బైపీసీ చదివింది. ఇటీవల జరిగిన నీట్ కౌన్సెలింగ్‌లో ఎన్టీయార్ హెల్త్ యూనివర్సిటీవారు విద్యార్థినికి కడప ఫాతిమా మెడికల్ కళాశాలో సీటు కేటాయించారు. ఈనేపథ్యంలో సోమవారం స్థానిక కళాశాలలో విద్యార్థినికి కళాశాల సిబ్బంది ఘనంగా సన్మానించారు. ఎంఈఓ సుబ్రమణ్యం మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలలో చదువుకొనే విద్యార్థినులకు ముగ్గురికి మాతమే ఎంబీబీఎస్‌లో ఉచిత సీట్లు వచ్చాయన్నారు. అందులో గుర్రంకొండ ప్రభుత్వ కళాశాలలో చదువుకొనే ఇద్దరు విద్యార్థినిలు ఉండడం విశేషమన్నారు. ప్రిన్సిపల్ అమరేంద్ర, లెక్చరర్ జమీర్, రోజారాణీ, సుధాకర్‌రెడ్డి, రమాదేవి, జాకీర రంగారెడ్డి, సురేష్ పాల్గొన్నారు.

ఇండస్ట్రియల్ టూర్‌తో సాంకేతిక విజ్ఞానం



సచివాలయాన్ని సందర్శిస్తున్న విద్యార్థులు

వాల్మీకిపురం: ఇండస్ట్రియల్ టూర్ ద్వారా విద్యార్థులు సాంకేతిక విజ్ఞానం పెంపొందించుకోవచ్చునని స్థానిక డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపల్ కల్పన అన్నారు. సోమవారం పాఠశాలలో 9, 10వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఒకేషనల్ కోర్సులో భాగంగా ఐటిఐటిఎస్ ట్రేడ్‌కు సంబంధించి ఇండస్ట్రియల్ విజిట్ కార్యక్రమంలో భాగంగా గ్రామ సచివాలయాన్ని సందర్శించారు. ఇలా తరుచూ ఇండస్ట్రీని సందర్శించి హ్యాండ్స్‌ఆన్ లర్నింగ్ నేర్చుకోవడం ద్వారా పిల్లలు నైపుణ్యాలను సాధించవచ్చునని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సెక్రటరీ వెంకటేష్, సచివాలయ సిబ్బంది, మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


కాలువ పటిష్టతపై ఎస్వీయూ నిపుణుల పరిశీలన

బి.కొత్తకోట: హంద్రీ–నీవా ప్రాజెక్టు పుంగనూరు ఉపకాలువ పటిష్టతపై శ్రీవెంకటేశ్వర విశ్వవిద్యాలయంకు చెందిన ప్రొఫెసర్లు బి.కొత్తకోట మండలంలో పరిశీలనలు నిర్వహించారు. బి.కొత్తకోట, కురబలకోట, మదనపల్లె మండలాల్లో సాగే ఈ కాలువకు పలుచోట్ల గండ్లు పడ్డాయి. వీటిని పూడ్చివేసి ఈ ఏడాది ప్రారంభంలో కృష్ణ జలాలను కుప్పంకు తరలించారు. ప్రస్తుతం ఈ కాలువకు పడిన గండ్లను పటిష్టం చేసి మళ్లీ గండిపడకుండా ఉండటానికి ఎలాంటి చర్యలు తీసుకోవాలి అన్న అంశంపై ప్రాజెక్టు అధికారులు ఎస్వీయూ సహకారం కోరారు. దీనిపై మట్టి, పునాదులకు సంబంధించిన అంశాల్లో నిష్ణాతులైన ప్రొఫెసర్లు సుధారాణి, మల్లికార్జున సహకారం తీసుకున్నారు. వీరు బి.కొత్తకోట మండలంలోని శెట్టిపల్లె, తరిగోడు ఎత్తిపోతల పథకం సమీపంలో, కురబలకోట మండలంలోని దొమ్మన్నబావి, ముదివేడు వద్ద కాలువల గండిని పూడ్చిన ప్రాంతాన్ని పరిశీలించారు. ఇక్కడ మళ్లీ గండిపడకుండా ఎలాంటి చర్యలు తీసుకోవాల్సి వస్తుందో పరిశీలించి నమూనాలను తీసుకెళ్లారు. దీనిపై ప్రాజెక్టు ఎస్ఈ రాజగోపాల్ సోమవారం మాట్లాడుతూ నిపుణులు ఇచ్చే నివేదిక ఆధారంగా గండిపడిన చోట్ల పనులు చేపడ్తామని చెప్పారు. నీటి ప్రవాహానికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పటిష్టమైన పనులు చే స్తామని చెప్పారు.

విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి

పీలేరు : విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలని కలికిరి సైనిక్ స్కూల్ జేసీవో వాంఖడే అన్నారు. సోమవారం స్థానిక మదనపల్లె మార్గంలోని పింఛా నదిలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమంలో భాగంగా కలికిరి సైనిక్ స్కూల్ ఎన్‌సీసీ క్యాడెట్లచే చెత్తను శుభ్రం చేపించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశుధ్యంపై ప్రజలను చైతన్యం చేయాలన్నారు.

పోలీస్ స్టేషన్ తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న సీఐ రమేష్

రామసముద్రం : మండల పోలీస్‌స్టేషన్‌ను సోమవారం మదనపల్లె సీఐ కె.రమేష్ తనిఖీ చేశారు. వివిధ కేసులకు సంబంధించి రికార్డులను పరిశీలించారు. సీఐ మాట్లాడుతూ అసాంఘిక కార్యక్రమాలు, అక్రమ కర్ణాటక మద్యం, పేకాట, కోడి పందేలు తదితర వాటిపై ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం మోపుతామన్నారు. జనజీవానికి ఆటంకాలు లేకుండా పోలీస్ సిబ్బంది అప్రమత్తంగా ఉండేలా చర్యలు తీసుకుంటామన్నారు. మండలం సరిహద్దుల్లోని చెక్ పోస్ట్ వద్ద నిఘాను పెంచామన్నారు. కొత్త వ్యక్తుల రాకపోకలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. మండలంలోని గ్రామాలపై నిఘా ఉంచామన్నారు. రౌడీషీటర్లు, అల్లరి ముఖలు పై ప్రత్యేక నిఘా పెట్టడం జరుగుతుందన్నారు. మండలంలో ఎవరైనా గొడవలకు పాల్పడితే ఎంతటివారైన ఉపేక్షించేది లేదన్నారు. ఈతనిఖీల్లో ఎస్ఐ వెంకటసుబ్బయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.